క్లుప్తంగా

విజేతలకు బహుమతుల పంపిణీ



గూడూరు: వేసవి సెలవుల్లో విద్యార్థులు తమలోని టాలెంట్లను బయటకు తీసుకురావడానికి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులు ఎంతగానో దోహదపడతాయని కృష్ణా జిల్లా గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి ఎండీ బషీర్ అన్నారు. గూడూరు గ్రంథాలయ శాఖలో గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆదివారం బహుమతులు అందజేశారు. బషీర్ మాట్లాడుతూ గ్రంథాలయ శాఖ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం డ్రాయింగ్‌లో గెలుపొందిన చందు, జాహ్నవి, జోత్స్న, క్యారమ్స్‌లో రేవంత్, నిహారిక, లాలిత్యకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ నిర్వాహకులు వై. శ్రీనివాసరావు, వెంకట రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

చైల్డ్‌హుడ్ గ్రూపునకు చెక్కు అందజేత



అవనిగడ్డ: చైల్డ్‌హుడ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్‌కు కె కొత్తపాలెంకు చెందిన రిటైర్డ్ ఉద్యోగిని మత్తి సీతారామయ్య నెల రోజుల పెన్షన్ రూ.40,800 విరాళంగా అందజేశారు. స్థానిక కార్యాలయం వద్ద ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి దివి లీలాకృష్ణకు చెక్కును అందించారు. చైల్డ్‌హుడ్ గ్రూపు చేస్తున్న సేవా కార్యక్రమాలను చూసి ఈ మొత్తం అందించామని సీతారామయ్య తెలిపారు. అనంతరం సీతారామయ్య దంపతులను ఘనంగా సత్కరించారు. అవనిగడ్డ శాఖ అధ్యక్షుడు అలపర్తి గోపాలకృష్ణమూర్తి, కార్యవర్గ సభ్యులు యాసం శోభన్‌బాబు, బండే శ్రీను, కమ్మిలి ప్రసాద్, ఘంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భగవద్గీత పఠనం



అవనిగడ్డ: స్థానిక ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో విద్యార్థులకు భగవద్గీత పఠనం, తెలుగు పద్యాలను నేర్పించారు. ఆధ్యాత్మిక గురువు మత్తి శేషగిరిరావు, డిగ్రీ కళాశాల అధ్యాపకులు ఎ. వీరకుమారి విద్యార్థులకు కథలు చెప్పడం, భగవద్గీత శ్లోకాలు, పుస్తక పఠనం, డ్యాన్స్ నేర్పించారు. గ్రంథాలయ అధికారి జుజ్జువరపు ప్రభుదాస్ పర్యవేక్షించారు.

భగ్గుమన్న భానుడు

- అధిక ఎండ, వడగాడ్పులతో ఉక్కిరిబిక్కిరైన నగర ప్రజలు
- 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

మచిలీపట్నంటౌన్: భానుడు నిప్పులు చెరిగాడు. ఆదివారం ఎండతోపాటు ఉక్కపోతతో నగర వాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం 8 గంటల నుంచే భానుడు ప్రతాపం చూపడంతో ఉదయం 10 గంటలకే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోయాయి. ఆదివారం 42 డిగ్రీల అధిక ఉష్ణోగ్రత నమోదైంది. ఇప్పటి వరకు 40 డిగ్రీల్లోపు ఉష్ణోగ్రతలే నమోదవుతూ వస్తోంది. ఆదివారం ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరిగి అధిక ఎండతో పాటు వడగాడ్పులు వీశాయి. నగర ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ఫలితంగా నగరంలోని వీధులు నిర్మానుష్యంగా మారాయి. కొనుగోలుదారులు లేకపోవడంతో దుకాణదారులు దుకాణాలను మూసివేశారు. సాయంత్రం 5.30 గంటల తరువాత దుకాణాలను తెరిచారు. అధిక ఉష్ణోగ్రతలతో చిన్నారులతో పాటు వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గృహాల్లో కూడా ఉండలేని పరిస్థితి ఉండటంతో ఏసీలు, కూలర్లను వినియోగించారు. రాత్రి వేళల్లో కూడా గృహాల్లో అధిక వేడి ఉండటంతో కునుకు పట్టక ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రోహిణీ కార్తెలో పరిస్థితి ఏమిటని పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. శీతల పానీయాలు, కొబ్బరి నీళ్లను తాగి సేదతీరుతున్నారు.

కొండలమ్మకు మొక్కుబడుల సమర్పణ



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారిని ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. క్యూలైనుల్లో భక్తులు అధికసంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి భక్తులు పాల పొంగళ్లను, మొక్కుబడులను సమర్పించారు. భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి ఏర్పాట్లు చేశారు.

ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు

అవనిగడ్డ: హనుమజ్జయంతి వేడుకలు అవనిగడ్డ, మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాలను అందంగా ముస్తాబు చేశారు. జై శ్రీరామ్, జై హనుమాన్ అంటూ భక్తులు చేసిన నినాదాలతో ఆలయ పరిసర ప్రాంతాలు మార్మోగాయి. పలు చోట్ల అన్నదానాలు చేశారు. అవనిగడ్డ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలోని సువర్చలా సమేత ఆంజనేయ స్వామి ఆలయంలో ఆగమ పండితులు దీవి రఘు, డీవీఎస్ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు జరిపించారు. ఈ సందర్భంగా స్వామివారికి లక్ష మల్లెలతో ప్రత్యేక అలంకరణ చేయగా, భక్తులు 108 పర్యాయాలు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఎమ్మెల్యే సతీమణి కెప్టెన్ లక్ష్మి, శ్రీరామా కేబుల్ అధినేత బీఎల్ఎన్ ప్రసాద్ ప్రత్యేక పూజలు చేశారు. పలు ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. ఆలయ ఈఓ పి. సీతారామయ్య, ఆలయ ధర్మకర్త పోతరాజు భాస్కరరావు పర్యవేక్షించారు.

పెడనలో హనుమాన్ శోభాయాత్ర

పెడన: పెడన పట్టణం బస్టాండ్ సమీపంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో వినాయక అభయాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామలక్ష్మీ వీవర్స్ కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయం ప్రత్యేక పూజలు చేశారు. భట్ట పైడేశ్వరరావు, రేఖ దంపతులచే పండితులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ శోభ యాత్ర బైక్ ర్యాలీ నిర్వహించారు. కమిటీ నాయకులు చిన్ని కృష్ణ ర్యాలీని ప్రారంభించారు. బంటుమిల్లి, తోటమూల, బస్టాండు సెంటర్ల సమీపంలోని హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజల అనంతరం యాత్ర రామలక్ష్మీ వీవర్స్ కాలనీకి చేరింది. ఆలయం వద్ద భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని పెడన ఎస్ఐ వి. రవిచంద్రకుమార్ ప్రారంభించగా స్థానిక పెద్దలు, కమిటీ నాయకులు పర్యవేక్షించారు. తోటమూల సెంటర్‌లో 16వ తేదీ వరకు జయంతి ఉత్సవాలను నిర్వహిస్తామని, 16న అన్న సమారాధన జరుగుతుందని ఆలయ కమిటీ పేర్కొంది. పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో 18 రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, తమలపాకులతో ప్రత్యేక పూజలు, వాసవి మహిళా మండలి ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

ముగిసిన హనుమాన్ జయంతి ఉత్సవాలు..

బంటుమిల్లి: పాశ్చాపురం గ్రామంలో సువర్చల ఆంజనేయస్వామి ఆలయంలో నాలుగు రోజులుగా జరుగుతున్న హనుమత్ జయంతి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. సుమారు 45 రోజులుగా జరుగుతున్న హనుమాన్ చాలీసా పారాయణ హనుమత్ జయంతితో ముగిసింది. ఈ సందర్భంగా స్వామి వారి ఉత్సవ మూర్తులను ఒంటె వాహనంపై ఉంచి మేళతాళాలతో, భక్తుల నామస్మరణతో గ్రామోత్సవం నిర్వహించారు. కమిటీ సభ్యులు, పెద్దలు, భక్తులు పాల్గొన్నారు. పాశ్చాపురం ఆంజనేయస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమంలో వేలాదిగా భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.



అవనిగడ్డలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు



మెరకనపల్లిలో ఆంజనేయ స్వామి వారికి పూజలు



కోడూరులో ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయ స్వామి



బుట్టాయిపేట దత్తాశ్రమంలో గారెలతో స్వామివారికి అర్చన

ఆకట్టుకున్న శోభాయాత్ర

కోడూరు: స్థానిక వంతెన సెంటర్‌లోని అభయ ఆంజనేయస్వామి వారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సువర్చలా సమేత ఆంజనేయ స్వామి వారి కల్యాణాన్ని కనుల పండువగా జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఐదు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. లింగారెడ్డిపాలెం, సక్కవానిదారి, పాదాలవారిపాలెం, వి.కొత్తపాలెం, జయపురం, ఉల్లిపాలెం, హంసలదీవి గ్రామాల్లో ఆంజనేయ స్వామి వారి ఆలయాల వద్ద జయంతి వేడుకలు జరిగాయి. గారె, అప్పాలు, వడ మాలలతో అలంకరించారు. ఆలయాల వద్ద 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శోభాయాత్రకు విశేష స్పందన..

హనుమాన్ జయంతిని పురస్కరించుకొని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్రకు విశేష స్పందన లభించింది. హిందూ ధర్మ భజన సేవా సంఘం, భాష్యకార భక్త సమాజం, తిరుమల భజన బృందం ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. కోడూరు తూర్పు వైపు నుంచి వంతెన సెంటర్‌లోని కల్యాణ వెంకన్న ఆలయం వరకు భక్తులు కాలినడక యాత్ర నిర్వహించారు. కాషాయ జెండాలను ధరించి 'జై హనుమాన్.. జై శ్రీరామ్' అంటూ నినాదాలు చేశారు.

దత్తాశ్రమంలో 11 వేల గారెలతో విశేషార్చన

మచిలీపట్నంటౌన్: బుట్టాయిపేటలోని శ్రీ దత్తాశ్రమంలో కార్యసిద్ధి ఆంజనేయస్వామికి 11 వేల గారెలతో విశేషార్చన నిర్వహించారు. ఉదయం గోపూజ, శ్రీ దత్తాత్రేయ స్వామి వారికి తైలాభిషేకం, మహా మంగళ హారతి, మంత్రపుష్పం, మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం కార్యసిద్ధి ఆంజనేయ స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. పరాసుపేట సువర్చలా సమేత ఆంజనేయస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో హనుమజ్జయంతి సందర్భంగా హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. సువాసినిలు పెద్ద ఎత్తున హాజరై హనుమాన్ చాలీసా పఠించారు. నగరంలోని బస్టాండ్ వెనుక ఉన్న ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. రాజుపేటలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం, రైలుపేటలోని నాగాంజనేయస్వామి ఆలయం, డ్రైవర్స్ కాలనీ అభయాంజనేయస్వామి ఆలయం, ఫత్తులాబాద ఆంజనేయస్వామి, ఈడేపల్లి శక్తిగుడి వద్ద ఉన్న ఆంజనేయస్వామి, చింతగుంటపాలెం మంచినీటి కాలువ వద్ద ఉన్న ఆంజనేయ స్వామి దేవస్థానాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

కృత్తివెన్ను: మండల పరిధిలోని గాంధీనగరం, నీలిపూడి, ఒంటిళ్లు తదితర గ్రామాల్లోని ఆలయాల్లో స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. గాంధీనగరంలో అభయ ఆంజనేయస్వామివారి దేవస్థానంలో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. సిందూరార్చన, తమలపాకులతో స్వామి వారికి పూజలు జరిపారు.

మోపిదేవిలో..

మెరకనపల్లి(మోపిదేవి): మండలంలోని పలు ఆంజనేయస్వామి ఆలయాల వద్ద ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కమిటీ పెద్దల పర్యవేక్షణలో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. మెరకనపల్లిలోని అభయాంజనేయ స్వామి వారి ఆలయం వద్ద భక్తులు సమర్పించిన హుండీ కానుకలను లెక్కించగా రూ. 15,516 ఆదాయం లభించిందని కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.



పాశ్చాపురంలో స్వామి వారి గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు



కృత్తివెన్ను మండలం గాంధీనగరంలో పూజలు చేస్తున్న భక్తులు



పెడనలో హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు



పెడన రామలక్ష్మీ వీవర్స్ కాలనీ ఆలయం వద్ద అన్న సమారాధన

శోభాయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: అవనిగడ్డ నియోజకవర్గంలో చేపట్టిన హనుమాన్ శోభాయాత్రను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆదివారం ప్రారంభించారు. స్థానిక వంతెన సెంటర్‌లో ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద హిందూ దేవాలయాల పరిరక్షణ ట్రస్ట్, భజరంగ్‌దళ్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సింహాద్రి, యువనేత సింహాద్రి వికాస్ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన పెరగాలన్నారు. అనంతరం అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక మీదుగా బైక్ ర్యాలీ సాగింది. డీఎస్పీ మురళీధర్, అవనిగడ్డ, చల్లపల్లి సీఐలు శ్రీనివాస్, రవికుమార్, ఆధ్యాత్మిక గురువులు, భజరంగ్‌దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.



అవనిగడ్డలో శోభాయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే సింహాద్రి

నాణ్యమైన విద్యకు ప్రాధాన్యం ఇవ్వండి

పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: నగరంలోని విద్యాసంస్థలు నాణ్యమైన విద్యకు ప్రాధాన్యతను ఇస్తూ విద్యార్థులను ప్రయోజకులను చేయాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. ఆదివారం నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన ది సన్ స్టార్ స్కూల్‌ను ఆయన నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మతో కలిసి ప్రారంభించారు.

పేర్ని కిట్టు మాట్లాడుతూ మంచి ప్రమాణాలతో విద్యాబోధన చేసేందుకు ప్రణాళిక రూపొందించుకుని యాజమాన్యం ది సన్ స్టార్ స్కూల్‌ను ప్రారంభిస్తోందన్నారు. స్కూల్ ఫౌండర్ డైరెక్టర్ పి. శ్రీరాం, మేనేజింగ్ డైరెక్టర్ బీపీ స్వామి మాట్లాడుతూ ది సన్ స్టార్ స్కూల్‌లో మంచి ప్రమాణాలతో విద్యాబోధన చేసే విధంగా విధి విధానాలను రూపొందించామని వివరించారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా, డెప్యూటీ మేయర్లు లంకా సూరిబాబు, తంటిపూడి కవిత థామస్ నోబుల్, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, కార్పొరేటర్లు యండ్రపాటి నాగేశ్వరరావు, రామిశెట్టి వాణిశ్రీ, నాయకులు పాల్గొన్నారు.



ది సన్ స్టార్ స్కూల్‌ను ప్రారంభిస్తున్న పేర్ని కిట్టు. చిత్రంలో మేయర్ వెంకటేశ్వరమ్మ

నేతన్నలకు యంత్రాల పంపిణీ



గూడూరు: కలనేత చేనేత సంక్షేమ సంఘం ద్వారా దాతల సహకారంతో కప్పలదొడ్డి గ్రామంలోని చేనేత కార్మికులకు జకాడ్ యంత్రాలను ఆదివారం అందజేశారు. టు మేక్ ఏ డిఫరెన్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రశాంతి సౌజన్యంతో ఒక్కొక్కటి రూ.5 వేల విలువ కలిగిన 25 జకార్డు యంత్రాలను గ్రామంలోని నిరుపేద చేనేత కార్మికులకు అందజేశారు. గ్రామంలోని 30 మంది నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కలనేత చేనేత సంఘం వ్యవస్థాపకుడు భూసం లోకనాథం, ఫౌండేషన్ సభ్యులు జగదీష్, కలనేత చేనేత సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు భూసం లోకనాథం, జాతీయ క్రీడాకారుడు ప్రభు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జేవీకే కిట్ల నాణ్యతలో రాజీ వద్దు

రాష్ట్ర పరిశీలకుడు హైమేశ్వరరావు

పెడన: విద్యార్థులకు అందించే జగనన్న విద్యా కానుక కిట్ల నాణ్యత విషయంలో ప్రభుత్వం రాజీ పడే ప్రసక్తే లేదని, వాటిల్లో ఏమాత్రం తేడా ఉన్నా తక్షణం సంబంధిత యాప్‌లో తెలియ జేయాలని రాష్ట్ర పరిశీలకుడు ఆర్. హైమేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆయన పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని ఎమ్మార్సీలలో జేవీకే స్టాక్ పాయింట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా హైమేశ్వరరావు ఎంఈఓలకు, సీఆర్పీలకు పలు సూచనలు చేశారు. జేవీకే కిట్లను అందుకున్న వాటిల్లో ఐదు శాతం స్టాకును క్వాలిటీ కంట్రోల్ టీంలోని సభ్యులైన నాడు-నేడు ఏఈ, సెర్ప్ ఏపీఎంలు పరిశీలించాల్సి ఉంటుందన్నారు. ఏ మాత్రం నాణ్యతలో తేడా ఉన్నా తక్షణం ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. అదే సమయంలో జేవీకే యాప్‌లో పొందుపరచాల్సి ఉంటుందన్నారు.

ఈ విద్యా సంవత్సరంలో పెడన మండలంలో ఎంత మందికి జేవీకే కిట్లను అందించనున్నారనే విషయాలను ఇన్‌చార్జి ఎంఈఓ ప్రసాద్ హైమేశ్వరావుకు వివరించారు. 4,570 మంది కిట్లను అందుకోనున్నారని, స్టాక్ పాయింట్ల నుంచి పాఠశాలలకు ఈ నెల 30వ తేదీ నుంచి సరఫరా చేస్తామని ఎంఈఓ వివరించారు. హైమేశ్వరావు మాట్లాడుతూ పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు జేవీకే కిట్లను అందించాలన్నారు. అనంతరం జేవీకే కిట్ల రిజిస్టర్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష జిల్లా సీఎంఓ గోపాలరావు, సీఆర్పీలు పాల్గొన్నారు.



జేవీకే రిజిస్టర్లను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు హైమేశ్వరరావు

అపూర్వం.. ఆత్మీయ కలయిక



కృత్తివెన్ను: మండల పరిధిలోని సంగమూడి ఉన్నత పాఠశాలలో 2003-04 సంవత్సరానికి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం పాఠశాల ప్రాంగణంలో జరిగింది. విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలను, ఆనాటి స్నేహితులను చూసి ఉద్వేగానికి గురయ్యారు. మిత్రుల క్షేమ సమాచారం తెలుసుకుని సంతోషంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రుక్మానందరెడ్డి, రాధాకృష్ణకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు అధికారులతో మంత్రి జోగి రమేష్ సమావేశం

పెడన: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, జిల్లా కలెక్టర్‌తో పాటు పెడనలోని మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహిస్తారని మంత్రి కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు పెడన మార్కెట్ కమిటీ హాల్‌లో సమావేశం జరుగుతుందని పేర్కొంది.

ఉరుసుకు దర్గా ముస్తాబు



హజ్రత్ నిర్గన్ షా అవులియా దర్గా



దర్గాలోని బాబా సమాధి

రేపటి నుంచి హజరత్ నిర్గన్ షా అవులియా దర్గా ఉత్సవాలు

గూడూరు: గూడూరులోని హజరత్ నిర్గన్ షా అవులియా దర్గా ఉరుసు ఉత్సవాలకు ముస్తాబైంది. జిల్లాలో ప్రసిద్ధి చెందిన దర్గాలలో గూడూరులోని హజరత్ నిర్గన్ షా అవులియా దర్గా ఒకటి. ఈ దర్గా మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. కుల మతాలకు అతీతంగా హిందువులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తారు. బాబాకు మొక్కుబడులు సమర్పిస్తారు.

రెండు రోజుల పాటు ఉత్సవాలు..

ఈనెల 16, 17 తేదీల్లో రెండు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. తొలి రోజు మంగళవారం సందల్ (గంధ మహోత్సవం) నిర్వహిస్తారు. బాబాకు ప్రతీకగా ఆకుపచ్చని జెండా, గుర్రంను దర్గా నుంచి వీధుల్లో మేళతాళాలతో ఊరేగిస్తారు. రెండో రోజు చిరాఖా (దీపా రాధన) ఉంటుంది. దీపారాధనలో భాగంగా బుధవారం రాత్రి కాంపిటీషన్ కవ్వాలి నిర్వహిస్తారు. దీనికోసం నాగపూర్‌కు చెందిన గాయని ఆఫ్రీన్ రంగేళి, ముంబయి గాయకుడు మొయిన్ నాజ్ మధ్య పోటీ ఏర్పాటు చేశారు.

కోరికలు తీర్చే బాబా..

హజరత్ నిర్గన్ షా అవులియా బాబాను కోరికలు తీర్చే బాబాగా భక్తులు నమ్ముతారు. దర్గాకు వచ్చే భక్తులు బాబాకు చాదర్లు సమర్పించి మొక్కుబడులు సమర్పిస్తుంటారు. బాబాకు మిఠాయి అంటే ఎంతో ప్రీతి. దర్గాకు వచ్చే వారు ఖచ్చితంగా మిఠాయి తీసుకొని వస్తారు. ఉత్సవాలకు ఉమ్మడి రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివస్తారు.

భక్తుల సహకారంతోనే..



దర్గాకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేకున్నా భక్తుల సహాయ సహకారాలతో ఘనంగా ఉత్సవాలు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఆదేశాల మేరకు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం.

– ఎండీ యాసిన్, దర్గా కమిటీ అధ్యక్షుడు

దివ్య సత్ప్రసాద పండుగ

మచిలీపట్నంటౌన్: నగరంలోని పరాసుపేట ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం దివ్య సత్ప్రసాద పండుగ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చర్చి ఫాదర్ లాం జయరాజు, అసిస్టెంట్ ఫాదర్ రవికుమార్ పర్యవేక్షణలో ఈ మహోత్సవం జరిగింది. నగరంతో పాటు పలు గ్రామాలకు చెందిన క్రైస్తవులు, బాల బాలికలు పాల్గొని దివ్య సత్ప్రసాదాన్ని స్వీకరించారు. బాలబాలికలు దివ్య బలిపూజ సమర్పించారు. ఆర్‌సీఎం చర్చి సంఘస్తులు, ఏఐసీసీ సభ్యుడు మువ్వల యోహాన్ పాల్గొన్నారు.